# ద్వంద్వ నీతి

నారిమన్ పాయింట్ నుండి నిరాటంకంగా వచ్చిన నా "సియోలో"కు మహిమ్ వచ్చేసరికి బ్రేకు పడింది.

ఆరోజు బుధవారం మహిమ్ చర్చికి "నవీన"కు వచ్చిన భక్తులతో రోడ్డు కిటకిటలాడుతుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముంబయిలో ఇలాంటి ట్రాఫిక్ జాంలు మామూలే. సిగ్నల్ దాటగానే, హైవే వైపుగాకుండా నేరుగా పోనీయమన్నాను డ్రైవర్ని.

"ఏ హోటల్‌కి వెళదాం?" రాజు అడిగాడు.

"సిద్ధార్థ"

"ఎప్పుడూ అదేనా ప్రవీణ్?"

"ఏం చేద్దాం? ఈవైపు అదొక్కటే మంచి వెజిటేరియన్ హోటల్-కం-బార్."

నేను మందుదాసుని అయినా స్ట్రిక్ట్ వెజిటేరియన్ని!

"లింకింగ్ రోడ్డులోని 'ధనరాజ్' కెళదాం, వెరైటీగా ఉంటుంది. అదీ వెజిటేరియన్ హోటలే."

మా కారు లింకింగ్ రోడ్డువైపు కదిలింది.

రాజు నా కజిన్. ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. నేను ఓ ఫారిన్ బ్యాంకులో వైస్‌ప్రెసిడెంటుగా ఉన్నాను. ఇద్దరం ఉండేది జుహూలో, ఆఫీసులు నారీమన్ పాయింట్‌లో. ఇద్దరికీ కంపెనీ కారులు ఉన్నా, ఏ ఒక్కరి కారులోనో కలిసి ప్రయాణం చేస్తూంటాం. మూడ్ ఉన్నప్పుడిలా డ్రింక్స్‌కు వెళుతుంటాం.

ధనరాజ్ దగ్గర మమ్మల్ని దింపి కారు పార్కు చేయటానికి ముందుకు వెళ్ళాడు డ్రైవరు." బాబూ దర్మం సాబ్, రెండు రోజులనుంచి పస్తులున్నాను. భోజనం పెట్టించండి సాబ్! మీకు పుణ్యం ఉంటుంది. భగవంతుడు మీకు మేలు చేస్తాడు సాబ్!" ఒక కుంటివాడు వెంటపడ్డాడు. ఇలాంటి వారంటే నాకు చిరాకు. మంచి మూడ్‌ను పాడు చేస్తారు. వాణ్ణి కసురుకుని హోటల్‌లో అడుగుపెట్టాను.

రాజు తాను "ధర్మదాత" అన్న ననిపిచుకుని ఆ తర్వాత వచ్చాడు.

రాజు అలాంటి అలాగా జనాన్ని ఎంకరేజ్ చేయడం నాకు నచ్చలేదు. మా మధ్య

చిన్న వాగ్యుద్ధం జరిగింది. డ్రింక్స్, చిప్స్, సోడా, పల్లీలు, ఇతర సరంజామా రాగానే టాపిక్ మార్చాను. కుంటివాడి మూలాన సాయంత్రం పాడుచేసుకోవడమెందుకు?

"ధన్‌రాజ్" "సిద్ధార్థ"కంటే బాగుంది. పదార్థాలెలా ఉన్నా వారి సర్వీసు నన్నానందపరిచింది.

తాగడం, తినడం అయిన తరువాత నా కార్పొరేట్ క్రెడిట్ కార్డుతో బిల్లు చెల్లించాను. ఇరవై రూపాయల నోటు ప్లేటులో పెట్టి, పెయిడ్ బిల్ తీసుకుని బయలు దేరాం. వాచ్‌మెన్ మా డ్రైవర్ని పిలుచుకు వచ్చాడు. వాడికో అయిదు రూపాయల నోటు పారేసి కారులో కూర్చున్నాను. రాజు కూర్చోగానే కారు కదిలింది.

మనసంతా ఉల్లాసంగా ఉంది. శరీరం గాలిలో తేలియాడుతుంది. ఇంటికి చేరి బెడ్‌మీద ఎప్పుడు పడ్డానో తెలీనేలేదు!

మర్నాడు మామూలే, రాజు రాగానే ఆఫీసుకు బయలు దేరాము.

రాజు ఎందుకో తనలో తాను నవ్వుకుంటున్నాడు.

" ఆ జోకు నాక్కూడా చెప్పు, నేనూ నవ్వుతాను."

"జోక్ కాదు. మనిషిలోని ద్వంద్వనీతికి నవ్వొచ్చింది" - రాజు

"పెద్ద పెద్ద మాటలతో చంపక, కాస్త అర్థమయ్యేట్టు చెబుదూ!"

"నిన్నటి మన అనుభవం జ్ఞాపకం వచ్చింది."

" అవును చాలా ఎంజాయ్ చేశాం. దాంట్లో మనిషీ-ద్వంద్వ నీతి ఏమిటి?"

"దాన్నే పర్‌స్పెక్టివ్ - దృక్కోణం అంటారు."

"మళ్ళీ పెద్దమాటలు. నీ మానేజ్‌మెంట్ భాషలోకాక కాస్త అర్థమయ్యేట్టు చెప్పవోయ్."

"నిన్నటి కుంటివాడు జ్ఞాపకం ఉన్నాడా? వాడికి నేను రెండు రూపాయలు ఇస్తే పెద్ద గొడవ పెట్టుకున్నావు, అలాంటి వారిని ఎంకరేజ్ చేసి సమాజానికి ఏదో అపకారం చేస్తున్నట్లు మాట్లాడావు. నాలాంటి వారే వారిని కరప్ట్ చేస్తున్నారన్నావు. కానీ నీవు చేసిందేమిటి?"

"నేనేం చేశాను? నీలా వాడికి అప్పనంగా డబ్బులు ఇవ్వలేదే?"

వాడికి ఇవ్వలేదు, కాని వెయిటరుకు ఇరవై రూపాయులు, వాచ్‌మెన్ అయిదురూపాయల టిప్పిచ్చావు. అది అప్పనంగా కాదూ? వారిని కరప్ట్ చేయడం కాదూ? - రాజు

"అది అప్పనంగా ఎలా అవుతుంది? వారి సర్వీసు నాకు నచ్చి ఆ ఆనందంలో వారికి బహుమతి ఇచ్చాను. తప్పా?"

"ప్రశ్న తప్పు, ఒప్పు అన్నది కాదు. సమస్య, మనలోని ద్వంద్వనీతి గురించి.

కుంటి బిక్షగాడికి రెండు రూపాయలు ఇస్తేనే సహించని నీవు, వెయిటర్‌కు 20 రూపాయల టిప్పిచ్చావు. ఎందుకు? అతను నీ ఇగో సాటిస్‌ఫై చేశాడని! వంగి వంగి సలాములు చేశాడని. దాంట్లో అతను అదనంగా చేసిందేముంది? సర్వ్ చేయడం అతని డ్యూటీ అది అతను చేశాడు. దానికి అంత భారీ టిప్పివడం సమంజసమేనా? రెండు రోజులనుండి పస్తులున్న బిచ్చగాడికి ఇష్టంగా దానం చేయడానికి అభ్యంతరం చెప్పిన నీవు, సుష్టుగా మూడు పూటలా మెక్కే వెయిటర్‌కి బక్షీస్ ఇచ్చావు! అదీ ఏ అయిదు రూపాయలో కాదు, ఏకంగా 20 రూపాయలు. నీ డాబు, దర్పంకి తగ్గట్లు నీ టిప్పు!" రాజు పెద్ద లెక్చరే ఇచ్చాడు. నేనూ ఊరుకోలేదు.

"నా దర్పాన్ని నీవేం దెప్పనవసరం లేదు. వాడు మనకు సేవ చేశాడు. తాగడానికి, తినడానికి అన్నీ చక్కగా అమర్చాడు. తిన్న ప్లేట్లు తీశాడు. కుంటివాడేం చేశాడు?"

"వెయిటర్ సేవలకు హోటల్ వాళ్ళు జీతం ఇస్తారు. కడుపునిండా భోజనం పెడతారు. కుంటివాడికా అవకాశం లేదు. వానికెవ్వరూ ఉద్యోగం ఇవ్వరు. అందుకని అడుక్కోవడం తప్ప గత్యంతరం లేదు. అలాంటి వారి పట్ల సహానుభూతి చూపాలి. చేతనైతే సహాయం చేయాలి. వెయిటర్‌కిచ్చినట్లు ఇరవై రూపాయలు కాకున్నా 1, 2 రూపాయలన్నా ఇవ్వాలి."

"వెయిటర్‌కు ఇరవై రూపాయలు ఇచ్చానని మరీమరీ దెప్పుతున్నావు, ఏ.సి. బారులో, ఆరేడు వందల బిల్లు చేసి అయిదురూపాయల టిప్పు ఇస్తే నామోషీకాదూ? మన ప్రెస్టేజికి భంగం రాదూ?"

"నేననే డబుల్ స్టాండర్డ్ అదే, ప్రెస్టేజీ కొరకు ఎంతైనా ఖర్చుపెట్టే మనం, ఒక బీదవానికి సహాయం చేయం. అవసరానికి ఆదుకోము."

"నీలాంటి వాళ్ళిలా సహాయం చేయడంవల్లనే దేశంలో బిచ్చగాళ్ళు ఎక్కువయ్యారు."

నేను ఓటమి స్వీకరించదలచలేదు.

"దేశ సమస్యలను చర్చిస్తూ కూర్చుంటే మనం ఆఫీసు మానుకోవాల్సి వస్తుంది. నేను చెప్పాను కదా, పరస్పెక్టివ్ అనీ! ఎవరి దృక్కోణం వారిది. మా ఆఫీసు వచ్చింది. సాయంత్రం కలుద్దాం." అని కారు దిగాడు రాజు. మా ఆఫీసువైపు మళ్ళింది కారు.

ఆఫీసులో పని చేస్తున్నాను. ఫోన్లు అటెండ్ అవుతున్నాను. నోట్స్ చదువుతున్నాను. సంతకాలు పెడుతున్నాను. ఎవరో వస్తున్నారు, వెళుతున్నారు. నా మనసంతా రాజు పేర్కొన్న డబుల్ స్టాండర్డ్ గురించే ఆలోచిస్తోంది. రాజుతో వాదించడంతో నా ఇగో శాంతించిన, మనసంతా అల్లకల్లోలంగా ఉంది. అసహనంగా ఉంది.

నిజం నిప్పులానే కాదు చేదుగా కూడా ఉంటుందని అనుభంలోకి వచ్చింది. రోగం కుదరాలంటే, జబ్బు నయం కావాలంటే మందు ఎంత చేదయినా మింగక తప్పదు కదా! ★